# ఇశ్రాయేలుతో దేవుని నిబంధన

> మరియు యెహోవా మోషేతో ఇట్లనెను – ఈ వాక్యములను వ్రాసికొనుము; ఏలయనగా ఈ వాక్యములనుబట్టి నేను నీతోను ఇశ్రాయేలీయులతోను నిబంధన చేసియున్నాను. అతడు నలుబది రేయింబగళ్లు యెహోవాతో కూడ అక్కడ నుండెను. అతడు భోజనము చేయలేదు నీళ్లు త్రాగలేదు; అంతలో ఆయన ఆ నిబంధన వాక్యములను, అనగా పది ఆజ్ఞలను ఆ పలకలమీద వ్రాసెను (నిర్గమ. 34:27, 28).

పాత నిబంధనలోని ప్రధానమైన నిబంధనలలో, దేవుడు తన ప్రజలైన ఇశ్రాయేలీయులతో చేసిన నిబంధన ఒకటి. దేవుడు అబ్రాహాముతో చేసిన వాగ్దానం క్రీస్తునందు నెరవేర్చబడే వరకు, దేవుని గూర్చిన జ్ఞానాన్ని భద్రపరచడానికి గాను ఈ నిబంధన తగిన స్థానంలో ఉంచబడింది (గలతీ. 3:17–19).

(గతంలో అబ్రాము, అంటే "హెచ్చింపబడిన తండ్రినుండి") అబ్రాహాముగా దేవుడు అతని పేరును మార్చాడు. "జనములకు తండ్రి" అనే అతని పాత్రను ప్రతిఫలింప జేయడానికి ఆయన యిలా చేశాడు (ఆది. 17:2–5; 22:17). అతని సంతానం బహుగా విస్తరించుతుందని దేవుడు వాగ్దానం చేశాడు. ఈ వాగ్దానం అబ్రాహాము కుమారుడైన ఇస్సాకుకు తిరిగి చేయబడింది (ఆది. 26:4) మరియు అతని పేరు ఇశ్రాయేలుగా మార్చబడిన అబ్రాహాము మనుమడైన యాకోబుతోను ఆ నిబంధన చేయబడింది (ఆది. 28:14; 32:28).

## ఈ నిబంధన యొక్క పూర్వ చరిత్ర

తన సహోదరులచేత యాకోబు కుమారుడైన యోసేపు ఐగుప్తుకు అమ్మబడడంలో ఇశ్రాయేలు ప్రజలతో నిబంధన స్థిరపరచబడేలా పరిస్థితులు నడిపించబడ్డాయి. తన యజమానుని భార్యచే అబద్ధంగా నింద మోపబడిన దానికి ప్రతిఫలంగా యోసేపు చెరసాలలో ఉంచబడ్డాడు. ఏడు సంవత్సరాల విస్తారమైన పంట తరువాత ఏడు సంవత్సరాల కరవు వస్తుందని ఫరోయొక్క కలలను వివరించి దానికి సంబంధించిన సలహాలను యిచ్చిన తరువాత, యోసేపు ఐగుప్తులోని రెండవ ఏలిక స్థానానికి హెచ్చింపబడ్డాడు. ఐగుప్తు దేశమంతటను కరవు విస్తరించి, కనానుకు తాకగా, ధాన్యం కొనడానికిగాను యాకోబు తన కుమారులలో పదిమందిని ఐగుప్తుకు పంపుతాడు. యోసేపు తన సహోదరులకు తన్ను తాను బయలుపరచుకొన్న తరువాత, తమ తండ్రిని ఐగుప్తుకు రప్పించడానికి యోసేపు అతని కొరకు మనుష్యులను పంపాడు, ఎందుకంటె కరవు యింకా ఏడు సంవత్సరాలు నిలిచియుండబోతుంది. దేవుడు యాకోబుకు ప్రత్యక్షమై ఐగుప్తుకు పోవునట్లు అతనికి సమాచారమిచ్చాడు. ఆయన యిలా అన్నాడు: "... ఐగుప్తునకు

వెళ్లుటకు భయపడకుము, అక్కడ నిన్ను గొప్ప జనముగా చేసెదను" (ఆది. 46:3). యాకోబు తన భార్యలను, కుమారులను, వారి భార్యలను, పిల్లలను – మొత్తం డెబ్బది మందిని అతడు ఐగుప్తునకు తోడుకొని పోయాడు (నిర్గమ. 1:1–5). వారి సంఖ్య త్వరలోనే విస్తరించింది: "ఇశ్రాయేలీయులు బహు సంతానముగలవారై అభివృద్ధి పొంది విస్తరించి అత్యధికముగా ప్రబలిరి; వారున్న ప్రదేశము వారితో నిండి యుండెను" (నిర్గమ. 1:7).

ప్రజలు ఐగుప్తులోనికి ప్రవేశించి నాలుగు వందల సంవత్సరాలు గతించిన పిమ్మట, అందులో అనేక సంవత్సరాలు బానిసలుగా ఉన్న తరువాత, మోషే దేవుని ప్రజలను ఐగుప్తునుండి వెలుపలికి నడిపించాడు. దేవుడు వాగ్దానం చేసినట్టే (ఆది. 12:2), అబ్రాహాము సంతతివారు గొప్ప జనాంగంగా తయారయ్యారు. ఇరవైయేండ్లు అంతకు పైబడినవారై యుద్ధమునకు పోగల 6,05,550 మంది జనాభాగల (సంఖ్యా. 1:45, 46) వారయ్యారు, మరియు లేవీ గోత్రమునుండి 22,000 మంది (సంఖ్యా. 3:39) ఇశ్రాయేలీయుల మత సంబంధమైన కార్యకలాపాలు జరిపించే వారు కూడా ఉన్నారు (సంఖ్యా. 1:50–53).

అబ్రాహాము, ఇస్సాకు, యాకోబు సంతతియైన వీరు ఐగుప్తును వీడి, సీనాయి పర్వతము వద్దకు చేరుకున్నారు. దేవుడు అక్కడ వారికి దేశీయ చట్టాన్ని ప్రసాదించాడు (నిర్గమ. 19:23; 20:1–17), ఆ స్థలాన్ని హోరేబు అని కూడా అంటారు (ద్వితీయో 5:2), ఈ చట్టాన్ని గూర్చి మోషే ఇలా అడిగాడు: "ఏలయనగా మనము ఆయనకు మొఱపెట్టునప్పుడెల్ల మన దేవుడైన యెహోవా మనకు సమీపముగానున్నట్టు మరి ఏ గొప్ప జనమునకు ఏ దేవుడు సమీపముగా నున్నాడు? మరియు నేడు నేను మీకు అప్పగించుచున్న యీ ధర్మశాస్త్రమంతటిలోనున్న కట్టడలును, విధులునుగల గొప్ప జనమేది?" (ద్వితీయో. 4:7, 8).

## ఆ నిబంధన యొక్క నిర్మాణం

ధర్మశాస్త్రంలో కట్టడలు, విధులు ఉన్నాయి (ద్వితీయో. 4:7, 45; 5:1), ఇవన్నీ దేవుని ఆజ్ఞలుగా భావించబడ్డాయి. మోషే యిలా అన్నాడు, "మీ దేవుడైన యెహోవా ఇచ్చిన ఆజ్ఞలను మీకాజ్ఞాపించుచున్నాను. వాటిని గైకొనుటయందు నేను మీ కాజ్ఞాపించిన మాటతో దేనిని కలుపకూడదు, దానిలోనుండి దేనిని తీసివేయకూడదు" (ద్వితీయో. 4:2).

ఈ నిబంధనను "నిబంధన గ్రంథమని" (నిర్గమ. 24:7), "నిబంధన రక్తమని" (నిర్గమ. 24:8), మరియు "నిబంధన పలకలు" అని సూచించారు (ద్వితీయో. 9:11). "నిబంధన మందసం" అని కూడ దీనికి సంబంధించినదాన్ని గూర్చి చదువుతాం (సంఖ్యా. 10:33; 14:44; ద్వితీయో. 10:8). పది ఆజ్ఞలు రాతి పలకల మీద వ్రాయబడి మందసంలో పెట్టబడినందున దానిని అలా పిలిచియుంటారు (ద్వితీయో. 10:4, 5).

ఈ నిబంధన "శాసనములని" కూడా సూచింపబడుతుంది (నిర్గమ. 27:21; 31:18;

32:15; 34:29; 40:20). అందువలన, "నిబంధన మందసము" అనే ప్రయోగం కూడా చేయబడింది (నిర్గమ. 25:16, 21, 22) లేక "శాసనములుగల మందసము" అని పిలువబడింది. "శాసనములు గల రెండు పలకలు" (నిర్గమ. 31:18), "సాక్ష్యపు గుడారం" (నిర్గమ. 38:21; సంఖ్యా. 1:50; 2 దినవృ. 24:6), "శాసనముల మీద కరుణా పీఠము" (లేవీ. 16:13), మరియు "శాసనములుగల అడ్డు తెర ..." (లేవీ. 24:3) అనేవి కూడా విధింపబడ్డాయి. ఇలా పేర్లు పెట్టబడిన విధానాన్ని బట్టి పాత నిబంధనను (శాసనమని) మరియు క్రైస్తవ లేఖనాలను క్రొత్త నిబంధన అనియు పిలువబడ్డాయి.

పాత నిబంధనలో యోషీయా యొక్క సంస్కరణల కాలంలో చివరిగా నిబంధన మందసం ప్రస్తావించబడింది (2 దినవృ. 35:3), కొద్ది కాలంలోనే యూదా బబులోను చెరకు కొనిపోబడడం జరిగింది. క్రొత్త నిబంధన రచయిత మందసాన్ని గూర్చి ఉదహరించడంలో (హెబ్రీ. 9:4), అతనికి మందసం గూర్చి తెలిసియున్నట్టు తెలుస్తుంది. మందసాన్ని గూర్చిన చివరి సూచన యోహాను చేశాడు. (దర్శనంలో) అతడు దానిని దేవుని ఆలయంలో చూస్తున్నాడు (ప్రకటన 11:19).

అది పెద్ద ప్రాముఖ్యం కాకపోయినా, "నిబంధన," "శాసనము"లనేవి పర్యాయ పదాలుగా నిర్గమ, లేవీయ, సంఖ్యాకాండాలలో ఉపయోగింపబడగ, ద్వితీయోపదేశ కాండంలో పది ఆజ్ఞలను సూచించడానికి "శాసనము"లని గాక "నిబంధన" అనే పద ప్రయోగం జరిగింది.

## ఈ నిబంధన యొక్క స్వభావం

దేవుడు ఇశ్రాయేలుతో చేసిన నిబంధనకు సంబంధించి ముఖ్యమైన వాస్తవాలు లభిస్తున్నాయి.

(1) **దేవుడు నిబంధన చేశాడు.** ఇది దేవుడు ఇశ్రాయేలీయులపై విధించిన ఒడంబడికయైయుంది. ఉభయులలో తక్కువ పక్షం మీద ఎక్కువైన పక్షం విధించింది. దేవుడు తనకు యిచ్చిన మాటలను మోషే వ్రాయవలసియుంది. ఎందుకంటే, ఆ మాటల ప్రకారం, ఆయన నిబంధన చేస్తున్నాడు (నిర్గమ. 34:27). మరియు "మన దేవుడైన యెహోవా హోరేబులో మనతో నిబంధనచేసెను" అని మోషే అన్నాడు (ద్వితీయో. 5:2).

(2) **ఆ నిబంధన దేవునికి ఇశ్రాయేలుకు మధ్య జరిగింది.** దేవుడును ఇశ్రాయేలు ప్రజలు మాత్రమే ఆ నిబంధనలో చేర్చబడినట్టు చెప్పబడింది (నిర్గమ. 34:27; ద్వితీయో. 5:1, 2; 1 రాజులు 8:9, 21). ఆ నిబంధన ఇశ్రాయేలీయుల పూర్వికులతో గాని ఇతర దేశీయులతో గాని చేయబడలేదు. "యెహోవా మన పితరులతో కాదు, నేడు ఇక్కడ సజీవులమైయున్న మనతోనే ఈ నిబంధన చేసెను" అని మోషే అన్నాడు (ద్వితీయో. 5:3). అది ఇశ్రాయేలు ప్రజల కొరకు మాత్రమే కొనసాగింపబడిన నిబంధన.

(3) **నిబంధన తన హృదయములో పది ఆజ్ఞలను కలిగి ఉంది.** నిర్గమ. 34:28బి యిలా అంటుంది: "అంతలో ఆయన ఆ నిబంధన వాక్యములను, అనగా పది ఆజ్ఞలను

ఆ పలక మీద వ్రాసెను." నలభై సంవత్సరాల తరువాత, వాగ్దాన భూమిలోనికి ప్రవేశించ డానికి ఇశ్రాయేలు యొర్దానును దాటడానికి కొంచెం ముందు మోషే యిలా అన్నాడు: "మరియు మీరు చేయవలెనని ఆయన విధించిన నిబంధనను, అనగా పది ఆజ్ఞలను మీకు తెలియజేసి రెండు రాతి పలకల మీద వాటిని వ్రాసెను" (ద్వితీయో. 4:13; 10:1-4ను కూడా చూడు).

"పది ఆజ్ఞల"లోని "ఆజ్ఞలు" అనే పదం *dabar* అనే హెబ్రీ పదంనుండి తెనిగింప బడింది. దానికి "వాక్యము" లేక "సామెత" (లోకోక్తి) అని అర్థం. ఈ నామవాచకం 770 సార్లు "వాక్యము" అనియు, KJVలో 20 సార్లు "ఆజ్ఞ" అనియు తర్జుమా చేయబడింది. *mitsvah* అనే హెబ్రీ పదం "ఆజ్ఞ" అని తర్జుమా చేయబడినా, పది ఆజ్ఞలను సూచించడానికి ఎన్నడూ ఉపయోగించలేదు. క్రొత్త నిబంధన *entole* అనే పదం ఉపయోగిస్తుంది, అది ఎప్పుడు చూచినా "ఆజ్ఞ" అనే అర్థాన్నే యిస్తుంది. ఈ పది ఆజ్ఞలను కేవలం మంచి ఉద్దేశాలుగా భావించకూడదు. అవి నిజంగా చెప్పబడిన రూపంలోనే, దేవుని మాటలుగాను, ఆయన ఆజ్ఞలుగాను భావింపబడవలసియుంటుంది.

(4) **మోషే నిబంధనకు మధ్యవర్తి.** నిబంధన యిచ్చే విధానాన్ని వర్ణించడంలో, మోషే యిలా అన్నాడు, "యెహోవా ఆ కొండమీద అగ్ని మధ్యనుండి ముఖాముఖిగా మీతో మాటలాడగా మీరు ఆ అగ్నికి భయపడి ఆ కొండ యెక్కలేదు. గనుక యెహోవా మాట మీకు తెలియజేయుటకు నేను యెహోవాకును మీకును మధ్యను నిలిచియుండగా యెహోవా ఈలాగున సెలవిచ్చెను" (ద్వితీయో. 5:4, 5). ఈ ప్రతిపాదన వెంట, మోషే ఇశ్రాయేలుకు పది ఆజ్ఞల నిచ్చాడు (ద్వితీయో. 5:6-21).

(5) **నిబంధన సీనాయి లేక హోరేబు పర్వతం వద్ద యివ్వబడింది.** నిబంధన యివ్వక ముందు మోషే జనులను కొండ దిగువ భాగానికి సమకూర్చాడు (నిర్గమ. 19:17, 18). సీనాయి పర్వతం మీదికి ఎక్కిపోయి, దేవుని యొద్దనుండి నిబంధనను పొందిన తరువాత, దానిని ఇశ్రాయేలుకు యివ్వడానికి మోషే దిగివచ్చాడు (నిర్గమ. 19:23-20:17). దేవుడు హోరేబులో తమతో నిబంధన చేసినట్టు వారికి తెలిపాడు. అప్పుడతడు వారికి పది ఆజ్ఞలను వినిపించాడు (ద్వితీయో. 5:2-21).

(6) **ఈ నిబంధన యొక్క ప్రాథమిక డాక్యుమెంట్ నిబంధన మందసంలో పెట్టబడిన రెండు రాతి పలకల మీద వ్రాయబడింది.** పది ఆజ్ఞల యొక్క మాటలు "దేవుని వ్రేలితో" (నిర్గమ. 31:18; ద్వితీయో. 9:10), రెండు రాతి పలకల మీద (చెక్కబడ్డాయి) వ్రాయబడ్డాయి (నిర్గమ. 32:15, 16). అవి రెండు పలకల మీద వ్రాయబడినట్టు నిర్గమ. 34:1 మరియు ద్వితీయో. 5:22; 9:10; 10:3, 4లలో తిరిగి చెప్పబడింది.

కొండనుండి దిగి వచ్చినప్పుడు, ఇశ్రాయేలు దుష్టత్వాన్ని కనుగొన్న మోషే, వాస్తవంగా, మొదటిగా యివ్వబడిన పలకలను పగులగొట్టాడు (నిర్గమ. 32:19; ద్వితీయో. 9:16, 17). రెండవ మారు మోషే కొండ మీదికి ఎక్కి వెళ్లక ముందు, తుమ్మ కఱ్ఱతో (ప్రత్యేకింపబడిన కొలతలతో) మందసం చేయించుమని, దేవుడు అతనికి చెప్పాడు. (ఆ కొలతలు నిర్గమ. 25:10-22లో యివ్వబడ్డాయి; మందసం యొక్క నిర్మాణం నిర్గమ. 37:1-9లో దాఖలు చేయబడింది.) మోషే క్రొత్త పలకలను పొందిన తరువాత (నిర్గమ.

34:28బి), అతడు కొండ దిగివచ్చి, వాటిని నిబంధన మందసంలో ఉంచాడు (ద్వితీయో. 10:1–5). సొలొమోను కాలంలో ఆ పలకలు యింకను మందసంలోనే ఉన్నాయి (1 రాజులు 8:9, 21).

(7) **ప్రజలు ఐగుప్తును విడిచిన తరువాత దేవుడు ఇశ్రాయేలుతో నిబంధన చేశాడు** (1 రాజులు 8:9, 12). అది ఆదాము, నోవహు, అబ్రాహాము, ఇస్సాకు, లేక యాకోబులతో గాని వారి వెనువెంట వచ్చిన సంతానంతో గాని ఈ నిబంధన చేయబడలేదు (ద్వితీయో. 5:1–4), లేక భూలోకమందలి మరి ఏ యితర జనంతోను అది చేయబడలేదు. పూర్ణంగా ఎదిగిన దేశంగా రూపొందడానికి ఒక కుటుంబంగా ఉండడంనుండి, సంచరించిన జాతిగాను, ఐగుప్తులో బానిస ప్రజలుగాను వారు వృద్ధి చెందవలసియుంది.

(8) **నిబంధన రక్తంతో స్థిరపరచబడిన ఒప్పందం, ఒడంబడిక, లేక కాంట్రాక్టయి ఉంది.** మరణ శాసనం వ్రాసిన వాని మరణానంతరం క్రొత్త నిబంధన అమలులోనికి వస్తుందని చెప్పబడిన తరువాత (హెబ్రీ. 9:16, 17), హెబ్రీ పత్రిక యొక్క రచయిత యిలా అన్నాడు,

> ఇందుచేత మొదటి నిబంధన కూడా రక్తము లేకుండ ప్రతిష్ఠింపబడలేదు. ధర్మశాస్త్ర ప్రకారము మోషే ప్రతి యాజ్ఞను ప్రజలతో చెప్పిన తరువాత, ఆయన నీళ్లతోను, రక్త వర్ణముగల గొఱ్ఱెబొచ్చుతోను, హిస్సోపుతోను, కోడెలయొక్కయు మేకలయొక్కయు రక్తమును తీసికొని – "దేవుడు మీ కొరకు విధించిన నిబంధన రక్తమిదే అని చెప్పుచు, గ్రంథము మీదను, ప్రజలందరి మీదను ప్రోక్షించెను" (హెబ్రీ. 9:18–20).

ఆ యువకులు జంతు బలులను అర్పించిన మీదట నిబంధన యొక్క ప్రతిష్ఠ జరిగింది. "అప్పుడు మోషే రక్తమును తీసికొని ప్రజలమీద ప్రోక్షించి – ఇదిగో యీ సంగతు లన్నిటి విషయమై యెహోవా మీతో చేసిన నిబంధన రక్తము ఇదే అని చెప్పెను" (నిర్గమ. 24:8).

నిబంధన స్థిరపరచబడిన తరువాత, దానిని మార్చడానికి వీలులేదు సరిగదా, దానితో దేనిని కలపడానికి కూడా వీలులేదు. నిబంధన యొక్క మార్చబడని స్వభావాన్ని పౌలు యిలా సూచించాడు: "సహోదరులారా, మనుష్య రీతిగా మాటలాడుచున్నాను; మనుష్యుడు చేసిన ఒడంబడికయైనను స్థిరపడిన తరువాత ఎవడును దానిని కొట్టివేయడు, దానితో మరేమియు కలుపడు" (గలతీ. 3:15). అందువలన, దేవుడు ఇశ్రాయేలుతో చేసిన నిబంధన ప్రతిష్ఠింపబడిన తరువాత, ఏ షరత్తులు దానితో చేర్చబడవు సరిగదా ఏ యితర జనులకు సంబంధం లేని ప్రత్యేకమైన షరత్తులతో కూడిన ఒడంబడికయే అది.

(9) **నిబంధనను అనుసరించే కొన్ని దీవెనలు ఇశ్రాయేలుకు యివ్వబడతాయి.** "కాగా మీరు నా మాట శ్రద్ధగా విని నా నిబంధన ననుసరించి నడిచినయెడల మీరు సమస్తదేశ జనులలో నాకు స్వకీయ సంపాద్యమగుదురు. సమస్త భూమియు నాదేగదా. మీరు నాకు యాజక రూపమైన రాజ్యముగాను పరిశుద్ధమైన జనముగాను ఉందురని చెప్పుము" (నిర్గమ. 19:5, 6ఎ).

పది ఆజ్ఞలు యిచ్చిన తరువాత, మోషే ఇశ్రాయేలుతో యిలా తెలిపాడు, "కాబట్టి

మీరు కుడికే గాని యెడమకే గాని తిరుగక మీ దేవుడైన యెహోవా ఆజ్ఞాపించినట్లు చేయుటకు జాగ్రత్తపడవలెను. మీరు స్వాధీనపరచుకొనబోవు దేశములో మీరు జీవించుచు మేలుకలిగి దీర్ఘాయుష్మంతులగునట్లు మీ దేవుడైన యెహోవా మీకు ఆజ్ఞాపించిన మార్గములన్నిటిలో నడుచుకొనవలెను" (ద్వితీయో. 5:33).

వారు ఆయన నిబంధనను అనుసరించినట్లయితే, దేవుడు ఇశ్రాయేలును తన ప్రత్యేకమైన రాజ్యముగా చేసికొంటాడని ఈ లేఖన భాగాలనుండి నేర్చుకొంటాం. అంటే, వాగ్దాన భూమిలో వారికి ఐశ్వర్యము, దీర్ఘాయువు ప్రసాదింపబడుతుంది. దేవుడు అబ్రాహాము, ఇస్సాకు, యాకోబులకు ఆ భూమి వాగ్దానం చేయబడినా, దేవుడు ఇశ్రాయేలుతో చేసిన నిబంధన ప్రకారం వారు నిలిచియుంటేనే, అది వారికి చెందినదిగా కొనసాగుతుంది.

ఆ నిబంధనలో మరణానంతరానికి సంబంధించిగాని, నిత్య జీవానికి సంబంధించి గాని, పరలోక నివాసానికి సంబంధించి గాని ఏ ఆశీర్వాదమును చేర్చలేదు. అందులో చేర్చబడిన దీవెనలన్నీ తాత్కాలికమైనవి, భూ సంబంధమైనవి మాత్రమే. నిబంధన ననుసరించే వారికి భూమి మీద దీర్ఘాయువు, దేశంలో సౌభాగ్యం వాగ్దానం చేయబడ్డాయి.

(10) **నిబంధనను అతిక్రమించితే కొన్ని శాపాలు వస్తాయి.** ఇశ్రాయేలీయులు దేవుని నిబంధనకు విధేయులై ఉండకపోతే నిబంధనలో చేర్చబడిన ఆశీర్వాదాలను దేవుడు నివారించుతాడు. మరియు వారికి బాధలను కష్టాలను కలిగిస్తాడు. వారు నిబంధనను మీరినందున ఇశ్రాయేలు తరువాత అనుభవించిన బాధలలో – చెర, పరదేశంలోనికి కొనిపోబడడం అనేవి కూడా చేర్చబడ్డాయి.

లేవీయకాండం 26లో దేవుడు ఇశ్రాయేలుకు యిలా తెలియజేశాడు,

> మీరు నా మాట వినక నా ఆజ్ఞలన్నిటిని అనుసరింపక నా కట్టడలను నిరాకరించిన యెడలను, నా ఆజ్ఞలన్నిటిని అనుసరింపక నా నిబంధనను మీరునట్లు మీరు నా తీర్పుల విషయమై అసహ్యించుకొనినయెడలను, నేను మీకు చేయునదేమనగా మీ కన్నులను క్షీణింపచేయునట్టియు ప్రాణమును ఆయాసపరచునట్టియు తాప జ్వరమును క్షయ రోగమును మీ మీదికి రప్పించెదను (14–16ఎ వచనాలు).

అప్పుడు, పలు విధాలైన యిక్కట్లతో ఆయన వారిని బాధిస్తానని చెప్పాడు – ఒకవేళ అది వారిని మారునట్లు చేయనియెడల, వారిని యింకా ఏడు మారులు శిక్షిస్తానన్నాడు (18 వ.). వారు యింకను పాపం చేస్తునే వస్తుంటే, ఏడంతలు, మరల ఏడంతలుగా వారి శిక్షను అధికం చేస్తానన్నాడు (21, 24, 28 వచనాలు). ఆయన వారిని శిక్షించడంలో గల కారణాన్ని యిలా తెలియజేశాడు: "మీమీదికి ఖడ్గమును రప్పించెదను; అది నా నిబంధన విషయమై ప్రతి దండన చేయును" (25 వ.).

ఆకస్మిక భయము, తాపజ్వరము, తమ శత్రువుల స్వాధీనం చేయబడడం, కరవు, తెగులు, ఆందోళన కలిగించినా దేవునివైపు మారుమనస్సుతో తిరగకుంటే, ఆయన నిబంధనలో తన భాగాన్ని సంపూర్ణంగా వెనుకకు తీసికొంటాడు. "జనములలోనికి మిమ్మును చెదరగొట్టి మీవెంట కత్తి దూసెదను, మీ దేశము పాడైపోవును, మీ పట్టణములు

పాడుపడును” (33 వ.).

## ముగింపు

దేవుడు ఇశ్రాయేలుతో నిబంధనయందు తన్ను తాను బంధించుకున్నాడు. వారు ప్రవేశించనైయున్న కనాను దేశంలో వారికి దీర్ఘాయువు, ఐశ్వర్యం అనుగ్రహించి వారికి దేవుడనైయుంటానన్నాడు. ప్రజలు నిబంధనను అనుసరించితే వారు దేవుని ఆశీర్వాదాలను అనుభవిస్తారు; వారు దానిని భంగం చేస్తే మాత్రం, ఆయన వారిని శిక్షిస్తాడు.